క్లుప్తంగా

ఘనంగా తీజ్



మల్హర్ : మండలంలోని అద్వాలపల్లి లంబాడి తండాలో గిరిజనులు గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. యువతులు ప్రత్యేక పందిరి ఏర్పాటు చేసి 9 రోజుల పాటు ఉపవాస దీక్షలతో బుట్టల్లోని గోధుమ గింజలకు నీరు పోశారు. డప్పుచప్పుళ్ల నడుమ ప్రతేక పూజలు నిర్వహించారు. గోధమ బుట్టలతో సంప్రదాయ నృత్యాలతో తీజ్ ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య చేపట్టారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు రాజునాయక్, అజ్మీర అక్కిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా హిందీ దివస్



కాటారం : మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు మూడు లఘు నాటికలను ప్రదర్శించారు. హిందీ భాష గొప్పతన్నాన్ని వివరిస్తూ భాషోపాధ్యాయురాలు ఐ రాజమణి, ప్రిన్స్‌పాల్ సునీత ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, కవిత, నళిని, నాజియా, అరుణ, లక్ష్మీ, మణిమాల, సరిత, శ్రీలత, శిరీష పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

టేకుమట్ల : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వెలిశాల శివారులో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దంపల్లికి చెందిన కమ్మగోని శ్రీకాంత్ (24) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఆయన ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతూ వెలిశాల శివారులోని వ్యవసాయ బావిలో శ్రీకాంత్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. పేద కుటుంబం కావడంతో శ్రీకాంత్ అంత్యక్రియల కోసం స్థానిక హెడ్ కానిస్టేబుల్ కొయ్యడ చంద్రశేఖర్ రూ.4 వేలు, కానిస్టేబుల్ మధూకర్ వెయ్యి రూపాయలు సాయం అందించారు.

చికిత్స పొందుతున్న జీపీ కార్యదర్శి..

టేకుమట్ల : స్థానిక పంచాయతీ కార్యదర్శి అబ్బు రాజేందర్‌రెడ్డి (42) పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఆయన బుధవారం ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. కాగా మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

భూపాలపల్లి రూరల్ : మతిస్థిమితం లేని మహిళను ఆమె తల్లిదండ్రులకు సఖి కేంద్ర నిర్వాహకులు అప్పగించిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. సఖి కేంద్ర అడ్మినిస్ట్రేటర్ గాయత్రి కథనం ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామంలోని చెరువు గట్టుపై ఓ మహిళ పడుకుని ఉండగా 181 ద్వారా సమాచారం అందడంతో సఖి బృందం అక్కడకు చేరుకుని ఆమెను సఖి కేంద్రానికి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

20 లీటర్ల గుడుంబా స్వాధీనం



టేకుమట్ల (రేగొండ) : రేగొండ మండలంలోని రేపాక చెరువు కట్టపై 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. లావుడ్య కవిత, లావుడ్య సమ్మయ్య ద్విచక్ర వాహనంపై గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని ద్విచక్ర వాహనాన్ని, గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆశ్రమ స్కూల్ హెచ్‌ఎంగా సునీత

కాళేశ్వరం : స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ స్కూల్ హెచ్‌ఎంగా స్కూల్ అసిస్టెంట్ సునీతకు అప్పగిస్తూ ఐటీడీఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్‌కు, ఐటీడీఏ అధికారులకు హెచ్‌ఎం అమలరెడ్డి ప్రవర్తనపై తోటి ఉపాధ్యాయులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే ఐటీడీఏ అధికారులు విచారణ చేపట్టి ఆమెను తొలగించి సునీతకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమలరెడ్డి ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు సమాచారం.

ఇసుక లారీలతో ఇక్కట్లు



రోడ్డుపై దిగబడిన లారీలు

చిట్యాల : ఇసుక లారీలతో తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్తున్న దుస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొన్ని గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. వాహనదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రోడ్డుపై మట్టి కుప్పలు పోశారు. కాగా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద పోసిన మట్టి పూర్తిగా తడిసిపోయి ఇసుక లోడుతో వెళ్తున్న లారీలు దిగబడిపోతున్నాయి. ఈ క్రమంలో పరకాల నుంచి బస్సులు, ఇతర వాహనాలు రావడం లేదు. ఈ రోడ్డు వెంట వచ్చిన ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడడంతో వాహనాదారులకు స్వల్ప గాయాలయ్యాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఈ దారిలో బస్సులు నడవక పరకాల నుంచి మొగుళ్లపల్లి, చిట్యాల మీదుగా ఇతర గ్రామాలకు బస్సుల్లో వెళ్తున్నారు. రేగొండ వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇసుక లారీలను ఆపేయాలని ధర్నా

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి గ్రామ శివారులోని ఇసుక క్వారీ నుంచి రోజూ అనేక ఇసుక లారీలు ప్రయాణిస్తుండడంతో తారురోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యిందన్నారు. ఎమ్మెల్యే అండతో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని తెలిపారు. మూడు చోట్ల రోడ్డుపై లారీలు దిగబడడంతో రాకపోకలు స్తంభించాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, ఇసుక లారీల రాకపోకలను ఆపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముకిరాల మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్‌గౌడ్, గడ్డం కొంరయ్య, ఎంపీటీసీ అనిల్ , రవి, కుమార్, రమేష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోసపూరిత పార్టీలను నమ్మొద్దు



చిట్యాల: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మొగుళ్లపల్లిలో..

చిట్యాల : మోసపూరితంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలను నమ్మొద్దని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా నాయకుడు, మండల ఇన్‌చార్జ్ మంగళపల్లి రాజ్‌కుమార్ ప్రజలను కోరారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌టీపీల దిష్టిబొమ్మను గురువారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణలో ఏడు శాతం కూడా లేని అగ్రకులాలు ఏడు రాజకీయ పార్టీలకు అధిపత్యం వహిస్తున్నాయని తెలిపారు. అలాగే 93 శాతమున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నాయకత్వం అందించాలని డిమాండ్ చేశారు. అగ్రకులాలు కొంతకాలంగా ప్రజలను మోసగిస్తూ రాజకీయ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అణగారిన వర్గాల్లోని రాజకీయ చైతన్యాన్ని నీరుగార్చుతున్నాయని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రజలు ఆ రాజకీయ పార్టీల తీరును అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు పుల్ల ఆశోక్, మండల కమిటీ సభ్యులు రత్న రమేష్, పర్లపెల్లి కుమార్, చిలుముల వంశీ, కృష్ణ, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అగ్రకుల రాజకీయ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు మంద రమేష్, మండల ప్రచార కమిటీ సభ్యులు జన్నె లక్ష్మణ్, దూడపాక రాజు, బండారి కుమార్, శ్యాం. శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



మహదేవపూర్ : స్థానిక గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైనందుకు గాను సర్పంచ్ శ్రీపతిబాపును కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో అకుతోట నారాయణ, తడ్కల రమేష్, కూరతోట రాకేష్, తోట వెంకన్న, కడార్ల శంకర్, తోట సుధాకర్, వీరమల్ల రాజబాపు, అడుప రాజబాపు, కడార్ల రాజేష్, చీర్లవంచ రమేష్, వెన్నంపల్లి మహేష్, చంద్రమౌళి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



మహదేవపూర్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఈవీఎంల వినియోగంపై ప్రజలకు రెవెన్యూ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక బృందం ద్వారా ప్రజలకు ఓటు వేసే తీరుపై వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అంకూస్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలవేలం

భూపాలపల్లి రూరల్ : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు (శుక్రవారం) ఉదయం 11.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఆ శాఖ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఉదయం 9 గంటలకు హనుమాన్ నగర్‌లోని ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. వాహనాలు కొనుగోలు చేసిన వ్యక్తులు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

వేతనాలు, బకాయిలు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్ : మధ్యాహ్న భోజనం కార్మికులకు పెంచిన వేతనాలు, బిల్లు బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను గురువారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం సుగుణ మాట్లాడారు. ప్రభుత్వం వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్మికుల అక్రమ తొలగింపును నివారించాలని, వేతనాలు, బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి డబ్బులు ఈనెల 20లోపు బ్యాంకు ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్, వరలక్ష్మీ, స్వర్ణలత, మల్లమ్మ, రాజేశ్వరి, భవానీ, భాగ్య, రజని, రజిత, సరస్వతి, సుగుణమ్మ, పుష్ప, మరియమ్మ, సరోజన పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం



మహదేవపూర్: నిర్మానుష్యమైన మండల కేంద్రం

కాటారం : మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. తేలికపాటి చినుకులతో మొదలై కుండపోతగా కురిసింది. రోడ్లపైకి నీరు చేరడంతోపాటు డ్రైనేజీలు వరద నీటితో నిండిపోయాయి. పత్తి చేలలోకి నీరు చేరింది. గ్రామాల్లోని వాగులు, వంకలు వరదనీటితో నిండుకున్నాయి. శంకరంపల్లి సమీపంలో పిడుగు పడడంతో విద్యుత్ ఇన్సులేటర్లు పాడై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

మహదేవపూర్ : మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి మండలంలో మొత్తం 90.6 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా స్టాటిస్టికల్ అధికారి తెలిపారు. చెరువులు, వాగులు పొంగిపొర్లాయి.

ఎమ్మెల్యే గండ్ర చిత్రపటానికి క్షీరాభిషేకం

చిట్యాల : మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడు కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి యాదవుల అభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు. సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మడికొండ రవీందర్‌రావు, యూత్ విభాగం మండల కార్యదర్శి బుట్టి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

టేకుమట్ల : అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా, మండల అధికారులను బీజేవైఎం మండల అధ్యక్షుడు కొలుగూరి రమేష్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన కొందరు కూటమిగా ఏర్పడి అధికారులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. కొందరు లీడర్లుగా చెలామని అవుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి ఫిర్యాదు రాసి డబ్బులు వసూలు చేస్తున్నారని, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రెడ్డిని టార్గెట్ చేసి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు అసత్య ఆరోపణలతో మానసిక క్షోభకు గురి చేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. సదరు అక్రమార్కులను కట్టడి చేయకుండా కొందరు అధికారులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందన్నారు.

'ముదిరాజ్'ల అభివృద్ధే ధ్యేయం



చిట్యాల : ముదిరాజ్ కులస్తుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తోందని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన చేపపిల్లలను ఎంపీపీ వినోద, ఎంపీడీఓ రామయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి అవినాష్ చేతుల మీదుగా గురువార పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష



భూపాలపల్లి అర్బన్ : విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష గురువారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షకు ఆ శాఖ సెక్టోరియల్ అధికారులు కిషన్‌రావు, లక్ష్మణ్, రాజగోపాల్, కరుణాకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయ వసంతలక్ష్మీ, వేణు, చాంద్‌పాషా, మహేందర్, సునీత, చంద్రకళ, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పొలాల అమావాస్య



కాళేశ్వరం : కాళేశ్వరంలో రైతులు పొలాల అమావాస్య పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం దుక్కిటెద్దులకు రంగులు పూసి, నెమలి ఈకలు, దండలు కట్టి అందంగా అలంకరించారు. కాళ్లకు గజ్జెలు కట్టి డప్పుచప్పుళ్లతో ఊరేగించారు. దుక్కిటెద్దులతో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించారు. బండి శ్రీనివాస్, కొండయ్య, మనోహర్, కోండ్ర శ్రీనివాస్, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

మొగుళ్లపల్లి : గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై శ్రీధర్ స్పష్టం చేశారు. నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలచారి

మొగుళ్లపల్లి : విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. తొలుత చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు, రైతులు సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తం 43 దరఖాస్తులు రాగా అందులో 28 దరఖాస్తులను డీఈ నాగరాజుకు అప్పగించారు. 15 దరఖాస్తులను చైర్మన్ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు తిరుమల్‌రావు, చరణ్ దాస్, నరేందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్సూర్ నాయక్, డీఈ నాగరాజు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు అడ్డగట్ల ప్రమోద్, చంద్రశేఖర్, మణుదీప్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, సర్పంచ్‌లు మోటే ధర్మారావు, గాలి చంద్రమౌళి, పెంతల రాజేందర్‌రెడ్డి, అరవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవానికి వెళ్తూ అనంతలోకాలకు..

మల్హర్ : అద్వాలపల్లిలో జరుగుతున్న తీజ్ ఉత్సవానికి వెళ్తున్న యువకుడి బైక్‌ను లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కొయ్యూరు ఎస్సై నరేష్, స్థానికుల కథనం.. మండలంలోని అన్సాన్‌పల్లి గామానికి చెందిన అజ్మీర శివరాం-పద్మల కొడుకు శ్రీనివాస్ (19) అద్వాలపల్లిలో తీజ్ ఉత్సావాలల్లో భాగంగా సోదరి ఇంటికి వెళ్లేదుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. భూపాలపల్లి నుంచి వెళ్తున్న క్రమంలో నాగులమ్మ పరిసర ప్రాంతంలో తాడిచర్ల ఓసీపీ వైపునకు ఖాళీగా వెళ్తున్న బొగ్గు లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని మృతదేహంతో రోడ్డు మీద బైఠాయించారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. కొయ్యూరు ఎస్సై నరేష్, కాటారం, మహాముత్తారం ఎస్సైలు అక్కడికి చేరుకోని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి ధర్నా విరమింపజేశారు. మృతుడి తండ్రి శివారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. వారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్న ఎస్సై నరేష్ తెలిపారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు

బీఆర్‌ఎస్ పాలనలో బతుకులు దుర్భరం



పార్టీలో చేరిన వారితో సత్యనారాయణరావు

- టీపీసీసీ సభ్యుడు, పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణ

భూపాలపల్లి రూరల్ : బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో పేదలు బతుకులు దుర్భరంగా మారాయని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండలంలలోని నేరేడుపల్లి, తదితర గ్రామాలకు చెందిన పలువురు వార్డు మెంబర్ సిరికొండ శ్రీలత సుధీర్ దంపతుల సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి గండ్ర సత్యనారాయణరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పలువురు బీఆర్‌ఎస్ వైఖరితో విసిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మూడెడ్ల సురేష్, పుట్టపాక రాజు, ఉమ్మనవేణి కొమురయ్య, జక్కుల దేవేందర్, సిమ్మనవేణి సాంబయ్య, అనవేని మొగిలి, సాగర్ల రవి, బొందుగుల రమేష్, బొందుగుల తిరుపతి, దాసరి సదానందం, సాగర్ల దేవేందర్, బొందుగుల రాజు, ఉమ్మనవేని నరేష్, ఉమ్మనవేని గోపి, సిరికొండ పోషాలు, జునుగరి మల్లయ్య, ఎలుకటి ఓదెలు, ఎలుకటి రాజయ్య, పిట్టల రమేష్, గీద రాజిరెడ్డి, గీద దేవేందర్, సాగర్ల లలిత, ముడెడ్ల రాణి, సాగర్ల మల్లక్క, గీద సారక్క, మూడేడ్ల లక్ష్మీ, బొందుగుల సారక్క, దాసరి భాగ్యమ్మ ఉన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

మొగుళ్లపల్లి : ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కొర్కిశాల, పెద్దకోమటిపల్లి, మెట్టుపల్లి, మొట్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలతో వంటకాలు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత మాట్లాడారు. ప్రతిరోజు ఆహారంలో ఒక పూట చిరుధాన్యాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించేలా ఐరన్, కాల్షియం, ఫైబర్, విటమిన్లు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చందు, హరిప్రసాద్, సాజిత, గ్రామ కార్యదర్శి రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు దేవేంద్ర, రాజకుమారి, రమాదేవి ఆయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రజిత

20, 23 తేదీల్లో ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న విజిత, రాజయ్య

మొగుళ్లపల్లి : ఈనెల 20, 23 తేదీల్లో ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు కన్వీనర్లు విజిత, రాజయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎస్.రమేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమన్వయ సమావేశంలో జోనల్ కన్వీనర్ విజిత, మండల కన్వీనర్ జి.రాజయ్య మాట్లాడారు. 20న జోనల్, 23న మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 నుంచి 17 ఏళ్ల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపికలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, శ్రీలత, కోటి పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ సరికాదు

కాటారం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్ సరికాదని ఆ పార్టీ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే నాయకులను అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మంథనిలో పార్టీ అభ్యర్థి చందుపట్ల సునీల్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండం మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గంట అంకయ్య, పూసల రాజేంద్రప్రసాద్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీశైలం, రవీందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి